క్లుప్తంగా

శాకంబరీదేవిగా కల్కి పరంజ్యోతి అమ్మ భగవాన్



భట్టిప్రోలు: స్థానిక అమ్మ భగవాన్ ధ్యాన మందిరంలో కల్కి పరంజ్యోతి అమ్మ భగవాన్‌ను ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఏటా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్నట్లు అమ్మ భగవాన్ సేవా సమితి నిర్వాహకులు ఆలా వెంకటేశ్వరరావు, వెంకట బసవపున్నమ్మ తెలిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

మురుగు తొలగించండి



వేమూరు: వేమూరు దళితవాడలో సిమెంట్ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు చెబుతున్నారు. దీంతో గతంలో అనారోగ్యం బారిన పడి కొందరు చనిపోయిన సందర్భాలున్నాయని వెల్లడిస్తున్నారు. పంచాయతీ అధికారులు మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



బాపట్ల అర్బన్: యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో బాపట్ల మండలం నరసాయపాలెంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పేద ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా యజ్ఞం హాస్పిటల్ ఎండీ శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్యం అందించేందుకు.. ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

దాతలు ముందుకురావాలి



బాపట్ల అర్బన్: విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఎంఈఓ నిరంజన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దంపతులు టీవీ రంగం, ఎ.సరోజ మండల ప్రాథమిక పాఠశాల వెదుళ్ళపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు ఫ్యాన్లు ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్లు పని చేసిన సరోజని పదవీ విరమణ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు సాయం చేయటం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రహిమాన్, నాయకులు బడుగు శ్రీనివాస్, ఉదయ్ శంకర్, పీవీ నాగరాజు, గవిని శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరేశ్వర స్వామికి రుద్రాభిషేక పూజలు



కొల్లూరు : ఆషాఢ మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేక పూజలు ఆదివారం కొల్లూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గాడేపల్లి శివశర్మ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలను కార్యనిర్వాహక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

మీ రాకతో..

- ఒంటరి, వృద్ధాప్య మోములో విరిసె చిరునవ్వులు
- ప్రజల వద్దకే పాలనకు సాక్ష్యం వలంటీర్ వ్యవస్థ
- పింఛనుకే గౌరవం తెచ్చిన వలంటీర్లు
- ప్రతి నెలా 1న ఠంచనుగా..ఇంటికే వైఎస్సార్ పెన్షన్ 'కానుక'
- అన్ని వర్గాల్లో వలంటీర్ వ్యవస్థపై హర్షాతిరేకాలు

బాపట్ల అర్బన్: ప్రజల వద్దకే పాలనకు.. సాక్ష్యంగా నిలిచాయి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు. ప్రత్యేకించి సామాజిక పింఛను నగదు పంపిణీలో వలంటీర్ల సేవలపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా 1వ తేదీన ఠంచనుగా.. పింఛను అందుతున్న తీరును ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. అవ్వాతాతలతో పాటు ఒంటరి మహిళలు, దివ్యాంగులు వలంటీర్ల సేవలను కొనియాడుతున్నారు. తాము గౌరవమైన జీవితం గడిపేలా పింఛన్ సొమ్ము భరోసా ఇస్తోంది అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంతో.. 12 రకాల పింఛన్లు అందిస్తోంది. బాపట్ల జిల్లాలో 2,25,365 పెన్షన్‌దారులకు.. ప్రతి నెలా రూ.61.67 కోట్లు వలంటీర్ల చేతుల మీదుగా పంపిణీ జరుగుతోంది.

గత బాధలు..పెన్షన్‌దారులు ఎరుగు..!

అర్హతే ప్రామాణికంగా కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. గత తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామానికి ఇన్ని పింఛన్లు మాత్రమే..అనే పరిస్థితి నడిచింది. దానికితోడు టీడీపీ జన్మభూమి కమిటీల ఆశీర్వాదం లేనిదే.. పింఛను నగదు అందని దుర్భర స్థితి. దీంతో అర్హులైనా కూడా.. పెన్షన్ అందక చాలా మంది నిస్సహాయతకు గురయ్యే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటికి స్వస్తి చెప్పింది. అర్హత ఉంటే చాలు ఇంటికే వలంటీర్ల ద్వారా పెన్షన్ ఇస్తామని భరోసా కల్పించింది. ఏడాదిలో జూన్, డిసెంబరు నెలల్లో లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు అధికారులు. సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ నగదు అందకపోతే.. వాటికి గల కారణాలను సచివాలయ సిబ్బందే తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

పడిగాపుల నుంచి.. ఠంచనుగా ఇంటికొచ్చేవరకు..

గత తెలుగుదేశం ప్రభుత్వంలో అందజేసే అరకొర పెన్షన్ నగదు పొందేందుకు లబ్ధిదారులకు పడిగాపులు కాచేవాళ్లు. పంచాయతీ కార్యాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులు, దివ్యాంగులు నిరీక్షించిన సందర్భాలు కోకొల్లలు. ఒక్కోసారి వారం పది రోజులు పట్టిన సందర్భాలున్నాయి. తన పాదయాత్రలో ఈ సమస్యలన్నీటినీ గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిష్కారంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారు. ఇంటికే పింఛను అందజేసేందుకు వలంటీర్లను నియమించారు.



తూర్పు బాపట్ల పంచాయతీకి చెందిన గేరా నాగేంద్రమ్మకు వైద్యశాలకెళ్లి..పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాణి (ఫైల్)



బయో మెట్రిక్ ద్వారా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారు..



నేను కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రారంభంలో రూ.200ల పింఛను అందేది. ఈ మొత్తం తీసుకునేందుకు నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి. ఈ ప్రభుత్వంలో ప్రస్తుతం రూ.2,750 పెన్షన్ వస్తోంది. సీఎం వైఎస్ జగన్ పుణ్యమా అని ప్రతి నెలా 1న వలంటీర్ నా ఇంటి తలుపు తట్టి, పెన్షన్ అందజేస్తున్నారు.

– సోమన పుష్పవతి, పూండ్లగ్రామం, బాపట్ల మండలం.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



మాది పేద కుటుంబం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలంటీర్ ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛను నగదు అందజేస్తున్నారు. వైద్య ఖర్చులతో పాటు ఇతర అవసరాలకు సకాలంలో పింఛను నగదు ఉపయోగపడుతోంది. గౌరవంగా జీవిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– పైనం చంద్రశేఖర్, బాపట్ల.

సేవ సంతృప్తిని ఇస్తోంది..



వలంటీరుగా ప్రజలకు అందజేస్తున్న సేవలు సంతృప్తిని ఇస్తున్నాయి. ప్రత్యేకించి ప్రతి నెలా 1 తేదీన ఉదయమే అవ్వాతాతలకు పింఛను మొత్తం అందజేస్తున్నప్పుడు వారి సంతోషం మాటల్లో చెప్పలేం. వారి కళ్ళల్లో కనిపించే తృప్తి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. అదే మాకు దీవెనలుగా భావిస్తున్నాం. ఎవరైనా అనారోగ్యంతో బయట ప్రాంతంలోని ఆసుపత్రిలో ఉంటే అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నాను.

– కాంద్రు వాణి, వలంటీర్, హైదరపేట.

అర్హతే ప్రామాణికంగా.. సంక్షేమ పథకాలు

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం



నిజాంపట్నంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కోరారు. నిజాంపట్నంలోని సచివాలయం-2 పరిధిలో జల్సాబజార్, సచివాలయం -1 పరిధిలోని గోకుల్ నగర్, జెడ్పీ హైస్కూల్ ఏరియా, రజకపాలెం, మెయిన్ బజార్‌లో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థికంగా లబ్ధి చేకూరిందన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు ఇచ్చి ఆదుకుంటున్న జగనన్న కావాలా.. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఎత్తివేస్తామంటున్న చంద్రబాబునాయుడు కావాలా.. అని ప్రజలను ప్రశ్నించారు. ఇంటింటికీ వెళ్లి ఒక్కో కుటుంబానికి చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. పలువురు మహిళలు తమ కాలనీలో సైడ్ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిలబడిపోతుందని ఎంపీకి తెలిపారు. దీనిపై ఎంపీ మోపిదేవి స్పందిస్తూ వెంటనే సైడు కాలువలు తవ్వించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తమకు ఇళ్ల స్థలాలు రాలేదని పలువురు మహిళలు ఎంపీ దృష్టికి తీసుకురావడంతో ఏ కారణంగా రాలేదో అధికారులు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, జెడ్పీ టీసీ నర్రా సుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, యార్లగడ్డ మదన్‌మోహన్, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, సర్పంచ్ పోలేరమ్మ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంతోషాలు నింపుతున్న సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- అనంతవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



అనంతవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: పేద వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మొక్కవోని దీక్షతో అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆదివారం అనంతవరంలో రెండు విడతలుగా ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, ప్రకటించని హామీలను కూడా అమలు చేస్తూ.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పరిపాలన సాగించడం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిన తెలుగుదేశం పార్టీ నేతలు పేద వర్గాల ఉన్నతిని చూసి తట్టుకోలేక చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు జనసేన పార్టీని అడ్డుపెట్టుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారని.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలకు మేలు చేసే వైఎస్సార్ సీపీకి తిరిగి అధికారాన్ని అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో పలువురు తమకు ఇళ్ల పట్టాలు మంజూరు కాలేదని మంత్రి నాగార్జున దృష్టికి తీసుకురావడంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పట్టాలు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరచాలని పలువురు కోరడంతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్, జెడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీలు అమిరిశెట్టి శ్రీధర్, బావిరెడ్డి వెంకట్రామయ్య, సుగ్గున అశోక్‌కుమార్, ఇంటూరి ప్రవీణ్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, సర్పంచ్ అంకమ్మరావు, వేమూరు ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు, ఈఓ మణిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి..కోన రఘుపతి

- ముంపు పొలాల రైతుల బాధలను గుర్తించిన బాపట్ల ఎమ్మెల్యే
- సొంత ఖర్చుతో ఏటా ఈస్ట్, వెస్ట్ కాలువల్లో పూడిక తీత
- రైతు ప్రభుత్వం అంటూ.. హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ప్రొక్లెయినర్‌తో ఈస్ట్, వెస్ట్ డ్రైనేజీల వద్ద రైతులు



ఈస్ట్ డ్రైనేజీ

బాపట్ల: చిన్నపాటి వర్షానికే బాపట్ల మండంలోని ఈస్ట్, వెస్ట్, పాలిమేర కాలువలు పొంగి.. పొలాలు ఏటా ముంపునకు గురవుతున్నాయి. చేతికొచ్చిన పంట ముంపునకు గురికావటంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యేవారు. పెట్టుబడులు కూడా రాక అప్పులపాలయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక.. ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ సమస్యకు పరిష్కారం చూపారు. 12 వేల ఎకరాల రైతులు పడుతున్న బాధను గుర్తించారు. ముంపు పొలాలను సంరక్షించేందుకు కంకణం కట్టుకున్నారు. తన సొంత ఖర్చుతో కాలువల పూడికతీత పనులు నాలుగేళ్ల నుంచి చేపడుతున్నారు. ఆదివారం పూడికతీత పనులు నిర్వహించారు. రైతులూ భాగస్వాములయ్యారు.

డ్రైనేజీలు శుభ్రం ఇలా

బాపట్ల మండలంలోని జమ్ములపాలెం రోడ్డులోని ఈస్ట్ డ్రైనేజీ పది కిలోమీటర్లు, వెస్ట్ డ్రైనేజీ 11 కిలోమీటర్లు మేరకు పూడికతీత పనులు నాలుగేళ్లుగా చేపడుతున్నారు. వీటితో పాటు పాలిమేర కాలువ 4కిలోమీటర్లలోని పూడికతీత చేపట్టారు. వర్షాలు పడే ముందే పూడికతీత పనులు చేపట్టడం వల్ల ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. రూ.15లక్షలతో తొమ్మిది ప్రొక్లెయినర్లతో 20 రోజులు పాటు పూడికతీత పనులు చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే కోన చొరవ మర్చిపోలేం



ఎమ్మెల్యే కోన రఘుపతి నాలుగేళ్లుగా కాలువల పూడికత తీత పనులు చేపడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మా కష్టాలను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కోన చొరవతోనే పొలాలు ముంపునకు గురికాకుండా రైతులు ప్రశాంతంగా ఉన్నారు.

–అంకమ్మచౌదరి, రైతు.

రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం ఇది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వం రైతులను, కాలువలను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కాలువలో పూడికతీత పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే కోన రఘుపతి కృషి చేయటం హర్షించదగిన విషయం.

– కారంకి వీరయ్య, రైతు

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ విజయ్‌బాబు

రేపల్లె: సస్యరక్షణ పద్ధతులతో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయ్‌బాబు చెప్పారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని బేతపూడి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. విత్తనాలు మొలకలు వచ్చి వ్యాధి నిరోధక శక్తిని పెంచుకుంటాయన్నారు. దుకాణాలలో కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు రైతులు తప్పనిసరిగా బిల్లులు పొందాలని సూచించారు. ఒకవేళ నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టపోతే ఆ బిల్లుల ఆధారంగా పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఆర్బీకేల్లో కియోస్క్ మిషన్‌ల ద్వారా రైతులకు కావాల్సిన వంగడాలు, ఎరువులు, పురుగు మందులను స్వయంగా వీపీఏల ద్వారా తామే ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

22న 'చీకటిపువ్వు కథలు'పై చర్చావేదిక

తెనాలి: 'ఆహ్వానం' లక్ష్మి సంస్మరణలో పట్టణ సాహితీ, సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' నిర్వహిస్తున్న ప్రతినెలా చర్చా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న ప్రముఖ రచయిత్రి కత్తి పద్మ కథలు 'చీకటి పువ్వు'పై చర్చా వేదికను నిర్వహించనున్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. కథా రచయిత్రి కత్తి పద్మ చర్చను ప్రారంభిస్తారు. సుప్రసిద్ధ రచయిత్రి రమాసుందరి, ప్రజా సాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు చర్చలో మాట్లాడతారు. ఆహ్వానం లక్ష్మి ఈ ఏడాది ఏప్రిల్ 17న మృతిచెందారు. ఆమెకు నివాళిగా సంవత్సర కాలం ప్రతి నెలా ఒక మంచి పుస్తకంపై చర్చా కార్యక్రమం ఏర్పాటుచేస్తోంది.

గోల్డెన్ డేస్..



పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ కలయికలో పూర్వ విద్యార్థులు

కొల్లూరు : కొల్లూరు బాలురోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. 1972–73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు యాభై ఏళ్ల తర్వాత ఒడి ఒడికి చేరి.. సంతోషంగా గడిపారు. చిన్ననాటి మధుర స్మృతులను పంచుకున్నారు. జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ.. ఉల్లాసభరితంగా స్నేహితులతో ముచ్చటించారు. సుమారు 80 మంది తమ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఒకరి యోగ క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

సుమారు రూ.4.5లక్షల ఆస్తి నష్టం



అగ్నికి అహుతైన పూరిల్లు

నగరం: అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిల్లు దగ్ధమైన ఘటన బొరమాదిగ పల్లి గ్రామ సచివాలయ పరిధిలోని జంగంలంక ఎస్టీ కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జంగంలంకకు చెందిన చేవూరి మహలక్ష్మి పూరింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు పక్కనే ఉన్న కంతేటి కేశవులు, పొన్నం శ్రీనివాసరావు, తుపాకుల దావీదు ఇళ్లకు వ్యాపించాయి. దీంతో నాలుగు పూరిళ్లు అగ్నికి అహుతయ్యాయి. స్థానికులు రేపల్లె అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదంలో విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ.4.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. తహసీల్దారు ఎం. శ్రీనివాసరావు బాధితులను పరామర్శించి, ప్రభుత్వ సాయం అందేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామ సర్పంచ్ చందోలు దేవదాసు, ఉప సర్పంచ్ నల్లూరి రత్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు దొంతిబోయిన కొండలరెడ్డి బాధితులను పరామర్శించి, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

లారీ తగిలి ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కొల్లూరు: లారీ వెనుక భాగం తగలడంతో ద్విచక్ర వాహనదారుడికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిలుమూరుకు చెందిన గాలి సురేష్ ద్విచక్ర వాహనంపై కొల్లూరు నుంచి చిలుమూరు వెళ్తున్నాడు. కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన దాటిన అనంతరం కరకట్ట పైకి చేరుకునేందుకు మలుపు తిప్పి చిలుమూరు వైపు వెళ్తున్న లారీని దాటే క్రమంలో లారీ వెనుక భాగం తగలడంతో కింద పడిపోయాడు. ప్రమాదంలో యువకుడి కాలికి తీవ్ర గాయం కావడంతో.. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు.

నేడు పేరలిలో 'జగనన్న సురక్ష'

కర్లపాలెం: మండలంలోని పేరలి, తుమ్మలపల్లి సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీవో దాసరి రాంబాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తుమ్మలపల్లిలో, 11.30లకు పేరలి గ్రామంలో జరిగే శిబిరాలకు ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

బాల నేరస్తుడి అరెస్ట్

కర్లపాలెం: మైనర్ బాలుర పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నామని కర్లపాలెం ఎస్ఐ ఎం.సాంబశివరావు తెలిపారు. వివరాల మేరకు.. కర్లపాలెం పంచాయతీ రాజీవ్‌నగర్ గ్రామంలో ఇటీవల ముగ్గురు మైనర్ బాలుర పట్ల అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఆదివారం కర్లపాలెంలో బాల నేరస్తుడ్ని అదుపులోకి తీసుకున్నామని, సోమవారం గుంటూరులోని జువైనల్ కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

పగుళ్లు..పడితే తల పగులు



ఎంపీడీఓ భవనంలో పగుళ్లిచ్చిన గోడ

భట్టిప్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం భవనం గోడలు పగుళ్లిచ్చాయి. 1999లో నిర్మించిన ఈ భవనం గోడలు.. 20 ఏళ్లకే బీటలు వారుతున్నాయి. కార్యాలయం ప్రధాన ద్వారం పక్కనే ఉన్న సిబ్బంది గదిలో రెండు పక్కలా పెచ్చులూడి పడుతున్నాయి. పై అంతస్తులో పగుళ్ల మరింత ఎక్కువగా ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్



తెనాలిరూరల్: తెనాలి మండలం తేలప్రోలు గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శనివారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,650లు, ఐదు సెల్ ఫోన్‌లు, రెండు బైక్‌లు స్వాధీనపర్చుకున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.